రివాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. మెమోలను ఈనెల 10 తరువాత తీసుకోవాలని సూచించారు. రివాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి, ఈ నెల 17లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈ నెల 31వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

బీఈ కోర్సుల పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: ఓయూ పరిధిలోని బీఈ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. అన్ని విభాగాల బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (సీబీసీఎస్) ఎనిమిదో సెమిస్టర్, బీఈ (నాన్ సీబీసీఎస్) నాలుగో సంవత్సరం రెండో సెమిస్టర్ మేకప్, బ్లాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్ పరీక్ష ఫీజును ఈనెల 12లోగా చెల్లించాలని చెప్పారు. పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, ఆగస్టు 3: ఉస్మానియా వర్సిటీ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. ఎంఫిల్ క్లినికల్ సైకాలజీ, పీఎస్‌వై డీ క్లినికల్ సైకాలజీ, ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ క్లినికల్ సైకాలజీ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

గణేశ్ యువభక్త మండలి వినాయక ప్రతిమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డికి పూలబొకే అందజేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్స్ ఫెడరేషన్ నాయకులు

మట్టి గణపతులు ప్రతిష్ఠించాలి

ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 3: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మట్టి గణపతులు ప్రతిష్ఠించాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం గడ్డిఅన్నారం డివిజన్ పరిధి పీ అండ్ టీ కాలనీలో గణేశ్ యువభక్త మండలి ఆధ్వర్యంలో 39 ఫీట్లతో మట్టి గణపతి ప్రతిమను ప్రతిష్ఠ తలపెట్టిన పోస్టర్‌ను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ హితం కోరే ప్రతి ఒక్కరూ మట్టి గణపతులు ప్రతిష్ఠించి పూజించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బిచినేపల్లి వెంకటేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు భవానీప్రవీణ్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేతో సమావేశమైన ఎల్ఐసీ ఏజెంట్స్

చంపాపేట: లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (లియాఫీ)నాయకులు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో మార్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందజేసినట్లు ఫెడరేషన్ చైతన్యపురి బ్రాంచ్ సీబీ16 కార్యవర్గం అధ్యక్షుడు గోగిరెడ్డి అంజిరెడ్డి తెలిపారు. అనంతరం వారు హస్తినాపురం డివిజన్ పరిధిలోని హనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న లియాఫీ భవన నిర్మాణానికి సహకరించాలని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆలిండియా డిస్ప్లేనరీ కమిటీ చైర్మన్ పూరి వెంకటేశం, డివిజన్ ప్రెసిడెంట్ చింతల వెంకటరెడ్డి, కార్యదర్శి సుదర్శన్, కాశాధికారి గూడె శీనయ్య, ఫెడరేషన్ చైతన్యపురి బ్రాంచ్ కార్యదర్శి తుళ్లూరు దాసయ్య, కోశాధికారి దొడ్డి వెంకటేశ్ పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు

● మలక్‌పేట ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.గోపాల్

సైదాబాద్, ఆగస్టు 3: మత్తు పదార్థాలను విక్రయించే వారిపట్ల కఠిన చర్యలు తీసుకుంటామని మలక్‌పేట ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జె.గోపాల్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మలక్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, డ్రగ్స్, ఎండీఎంఏ, హానిస్ ఆయిల్, కోకైన్, ఎల్ఎస్‌డీ, బ్రౌన్‌షుగర్, ఎన్‌డీపీఎల్ లిక్కర్, నాటు సారాయి వంటి మత్తు పదార్థాలను విక్రయించిన, కొనుగోలు చేసిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతను మత్తును దూరంగా ఉంచటానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని, అందులో భాగంగా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. మత్తు పదార్థాలు విక్రయించిన, కొనుగోలు చేస్తున్న వ్యక్తుల వివరాలు తెలిస్తే 87126 59641లో సంప్రదించాలని తెలిపారు.

న్యూ నాగోల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

ఎల్బీనగర్, ఆగస్టు 3: కొత్తపేట డివిజన్ పరిధిలోని న్యూ నాగోల్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా పోచంపల్లి రాజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా రాజు, కాశాధికారిగా జి.మోహన్ రాజు, సహాయ కార్యదర్శిగా ఏ.తిమ్మారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఏ.మల్లారెడ్డి, ఉపాధ్యక్షులుగా శైలేందర్, శ్రీనివాస్‌రావు, కల్చరల్ సెక్రటరీగా శశిధర్‌రెడ్డి, కాలనీ ముఖ్య సలహాదారులుగా అనంతుల రాజిరెడ్డి, అడ్వైజర్‌గా సుమతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాట శ్రీశైలం గౌడ్, ఎన్.సత్యనారాయణరెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

బాలాపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి

బడంగ్‌పేట, ఆగస్టు 3: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గౌడ్, బాలాపూర్‌లో పలు అభివృద్ధి పనులను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించడంతో పాటు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. పనులు చేస్తున్న క్రమంలో అధికారుల పర్యవేక్షణ తప్పని సరిగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఈ జ్యోతి, కార్పొరేటర్ రామిడి మాదురి వీరకర్ణ రెడ్డి, వంగేటి ప్రభాకర్ రెడ్డి, నాయకులు ఎర్ర జైయింద్, నాగేందర్ గౌడ్, జంగయ్య తదితరులు ఉన్నారు.

పచ్చదనంపై ప్రత్యేక సమావేశం

బడంగ్‌పేట, ఆగస్టు 3: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో స్వచ్ఛదనంపై ప్రత్యేక సమావేశం శనివారం మేయర్ చిగిరింత పారిజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించ తలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పాలకవర్గ సభ్యులు, అన్ని విభాగాల అధికారులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్, కమిషనర్ రఘుకుమార్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్.. క్షీరాభిషేకం

ప్రిపరేషన్‌కు సమయం: భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మాల్యాద్రి

ఆర్కేపురం, ఆగస్టు 3: తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగ యువతకు ముందస్తు ప్రిపరేషన్‌కు ఎంతోగానో ఉపయోగపడుతుందని భాగ్యనగర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ మాల్యాద్రి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేసిన సందర్భంగా శనివారం ఇనిస్టిట్యూట్ ఆవరణంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఎస్ఐ, కానిస్టేబుల్‌తో పాటు ఇతర నోటిఫికేషన్స్ విడుదల చేసినప్పుడు సమయం ఇవ్వకుండా పరీక్షలు నిర్వహించేవారని, తరువాత ఫిజికల్ టెస్ట్ నిర్వహించేవారని తెలిపారు. ఈ జాబ్ క్యాలెండర్ ద్వారా ఏ నోటిఫికేషన్ ఎప్పుడు, పరీక్ష తేదీ ముందుగానే తెలుసుకునే అవకాశం ఉందన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సులభంగా మారుతుందన్నారు. తమ సంస్థలో ఒకే ఫీజ్‌తో ఎస్ఐ, కానిస్టేబుల్స్, గ్రూప్-2,3,4 పోస్టులకు ఒక్కసారి ఫీజు కడితే అన్ని రిక్రూట్‌మెంట్స్ ఐపోయేంతవరకు కోచింగ్ ఉంటుందని చెప్పారు. ఆగస్టు 15 నుంచి న్యూ బ్యాచ్ ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మాల్యాద్రి

ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల వద్ద సంబురాలు జరుపుకొంటున్న దృశ్యం.. చిత్రంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తదితరులు

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకమైనది

మన్సూరాబాద్, ఆగస్టు 3: ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శనివారం మన్సూరాబాద్ డివిజన్ బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు పారంద సాయి ఆధ్వర్యంలో ఎల్బీనగర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాల వద్ద ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ చిత్ర పటానికి మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్‌కుమార్, యంజాల జగన్, జి.శ్రీను, క్యాదాస్ చిరు, ఎర్ర యాదయ్య, నాంపల్లి రామేశ్వర్, ముత్యంరెడ్డి, కవితారెడ్డి, శ్రీధర్ గౌడ్, సాయిరాం గౌడ్, రాజేశ్‌గౌడ్, జయతేజ, రోహిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ టీఎస్ రంగారెడ్డి ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ

మాదిగల పోరాటం ఫలించింది

కందుకూరు, ఆగస్టు 3: మాదిగల పోరాటం ఫలించిందని ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తెలిపారు. సాయిరెడ్డిగూడ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ టీఎస్ రంగారెడ్డి ఉపాధ్యక్షుడు కంద పెద్ద నర్సింహ శనివారం శ్రీనివాస్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మేడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంద రాజు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు డబుల్ ఇండ్లు కేటాయించండి

డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించాలని ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసిన లబ్ధిదారులు

ఆర్కేపురం, ఆగస్టు 3: గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటాయించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించే విధంగా చూడాలని ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లకు చెందిన మహిళలు శనివారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డిని కలిసి కోరారు. కోర్టులో కేసు ఉండటంతో ఆలస్యం అవుతుందని.. కోర్టు కేసు సమస్యను త్వరగా పరిష్కరించి లబ్ధిదారులకు ఇండ్లు అందజేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌తో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన సీడీపీవో

సైదాబాద్, ఆగస్టు 3: మహిళా శిశు సంక్షేమశాఖ-1 (మలక్‌పేట ప్రాజెక్టు) సీడీపీఓగా బాధ్యతలు స్వీకరించిన పి.పావని శనివారం ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సాయినగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె స్థానికంగా.. అంగన్‌వాడీ కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిశీలించి, వాటి వివరాలను అడిగి తెలుసుకుని తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కోఆర్డినేటర్ ఎన్.శైలజ, అంగన్‌వాడీ టీచర్ సుంచు పద్మినీ, హెల్పర్ సక్కుబాయి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యం

మన్సూరాబాద్, ఆగస్టు 3: ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకొస్తే వాటిని వెంటనే పరిష్కరింపజేస్తామని విద్యుత్ శాఖ ఏడీఈ యుగేందర్ తెలిపారు. విద్యుత్ వినియోగం, విద్యుత్ సరఫరా, విద్యుత్ అంతరాయం, సోలార్ సిస్టమ్ ఏర్పాటు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని శనివారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ పరిధి రాక్ టౌన్‌కాలనీలో నిర్వహించారు. ఈ సందర్భంగా యుగేందర్ మాట్లాడుతూ లోఓల్టేజీ, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగినప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ దిలీప్, లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలి

సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థినులు

ఆర్కేపురం, ఆగస్టు 3: లక్ష్యాన్ని సాధించేందుకు విద్యార్థులు కృషి చేయాలని అనిబిసెంట్ మహిళా కళాశాలల చైర్మన్ డాక్టర్.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కొత్తపేటలోని అనిబిసెంట్ జూనియర్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు బీజేఆర్ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. తమ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది విద్యార్థినులు ఎన్నో ఉద్యోగ అవకాశాలు పొంది మంచి స్థాయిలో ఉన్నారని తెలిపారు. విద్యార్థినులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వైస్ ప్రెసిడెంట్ దయాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ గోరటి వెంకన్నకు ధన్యవాదాలు తెలుపుతున్న మాల సంఘాల నాయకులు

ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం

వనస్థలిపురం, ఆగస్టు 3: పార్లమెంట్‌లో చట్టం చేయకుండా ఎస్సీల వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల సంఘాల జేఏసీ నాయకులు అన్నారు. మండలిలో వర్గీకరణపై వ్యతిరేక గళం వినిపించిన సందర్భంగా ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్నకు వారు ధన్యవాదాలు తెలిపారు. వనస్థలిపురంలోని వెంకన్న నివాసానికి వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీల్లో మాల, మాదిగలకే కాకుండా అన్ని వర్గాలకు న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. వర్గీకరణ మాటున లబ్ధి పొందాలని చూస్తే సహించబోమని హెచ్చరించారు. అన్ని కులాలకు సమన్యాయం జరిగేలా కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. ఎలాంటి తారతమ్యాలు లేకుండా అందరూ ఐక్యంగా ఉండాలని ఎమ్మెల్సీ వెంకన్న ఈ సందర్భంగా వారికి సూచించారు. కార్యక్రమంలో మాల సంఘాల నాయకులు చేపూరి శంకరయ్య, కొంగరి నరసింహారావు, గద్దె శ్రీనివాస్, శంకరయ్య, రమేశ్, కృష్ణ, కాశీనాథ్, శ్రీధర్, వాసుదేవరావు, కృష్ణ, చేపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన కార్పొరేటర్

సైదాబాద్, ఆగస్టు 3 : ఆషాఢ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం సాయిరాం కాలనీలోని బంగారు మైసమ్మ ఆలయం వద్ద జరిగే పండుగ సందర్భంగా జరుగుతున్న అభివృద్ధి పనులను సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయటం జరిగిందన్నారు. అదే విధంగా సాయికాలనీలో కొనసాగుతున్న డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బంగారు మైసమ్మ ఆలయ నిర్వాహకులు రమణాకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం తగదు

హయత్‌నగర్, ఆగస్టు 3: శానిటేషన్ సిబ్బంది తమ విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం మార్నింగ్ వాక్‌లో భాగంగా బంజారాకాలనీకి వెళ్తుండగా మార్గమధ్యలో డిఫెన్స్ కాలనీ వద్ద రోడ్డుకు ఇరువైపులా చెత్తాచెదారం ఉండటాన్ని పరిశీలించారు. వెంటనే శానిటేషన్ సూపర్‌వైజర్‌ను పిలిపించి సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడం లేదని కాలనీవాసుల నుంచి తరచుగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై విధుల్లో నిర్లక్ష్యం కనబరిచితే ఊపేక్షించేదిలేదని, సూపర్‌వైజర్లు కూడా విధుల పట్ల అలసత్వం వహిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై నుంచి ఎవరైనా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాలనీల ప్రజలు చెత్తాచెదారాన్ని బహిరంగ ప్రదేశాల్లో పడేయకుండా ఇంటి ముందుకు వచ్చే చెత్తా రిక్షాల్లోనే వేయాలని కోరారు.

లేమూరులో ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న మేనేజర్ వెంకట్ నర్సప్ప, రేవంత్‌రెడ్డి

ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 3: ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం డిపో మేనేజర్ వెంకట్ నర్సప్ప కోరారు. డిపో నుంచి ఉదయం సాయంత్రం ఇబ్రహీంపట్నం నుంచి లేమూరు వరకు నూతనంగా బస్సును నడుపుతున్నట్లు చెప్పారు. శనివారం ఉదయం అగర్‌మియగూడ మాజీ ఉప సర్పంచ్ వడ్డెపల్లి రేవంత్‌రెడ్డితో కలిసి బస్సును ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రాజేశ్, వడ్డెపల్లి రేవంత్‌రెడ్డి, లిక్కి జంగారెడ్డి, వెంకట్‌రెడ్డి, రవీందర్, పాండు, గణేశ్, పెద్దిరాజు, దశరథ, ఆంజనేయులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

చింతపల్లి మల్లయ్య (ఫైల్)

మన్సూరాబాద్, ఆగస్టు 3: వ్యక్తి అదృశ్యమైన ఘటన ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా, పెనిమిల్ల, ఎర్తవానిపల్లి గ్రామానికి చెందిన చింతపల్లి మల్లయ్య (32) నాలుగేండ్ల కిందట కృష్ణవేణి అనే యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాది కాలంగా ఎల్బీనగర్, గుంటి జంగయ్య కాలనీలో నివాసముంటున్నారు. మల్లయ్య కూలీ చేయగా వచ్చిన డబ్బులతో ఇల్లు గడవడం కష్టంగా మారింది. దీంతో కృష్ణవేణి తరచూ భర్తతో గొడవ పడేది. గత నెల 17న డబ్బుల విషయంలో ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో మనస్తాపం చెందిన మల్లయ్య ఇంటి నుంచి వెళ్లి పోయాడు. పది హేను రోజులు గడుస్తున్న మల్లయ్య ఇంటికి తిరిగి రాకపోవడంతో కృష్ణవేణి ఎల్బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చింతల్‌బస్తీలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చింతల్‌లో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జంగం శ్వేత తదితరులు

సైదాబాద్, ఆగస్టు 3: ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని చింతల్‌బస్తీలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శనివారం స్థానిక కార్పొరేటర్ జంగం శ్వేత శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు జంగం మధుకర్ రెడ్డి, స్థానిక నాయకులు రఘుపతినాయక్, మహేశ్, సోమ్లా, రేణుక, భారతి, వెంకటేశ్, రవి, యాదయ్య, వనోద్, నాగరాజ్, శివ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.